క్లుప్తంగా

ఉద్యోగ విరమణ తప్పనిసరి



కృష్ణయ్య దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

చిన్నమండెం : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పక ఉంటుందని చిన్నమండెం సబ్ పోస్టుమాస్టర్ భాస్కర్‌నాయక్ అన్నారు. చిన్నమండెం సబ్‌పోస్టాఫీస్ పరిధిలోని చాకిబండ బ్రాంచ్ పోస్టుమాస్టర్ కురియాల కృష్ణయ్య పదవీవిరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌నాయక్ పదవీవిరమణ తర్వాత కొత్త జీవితం ప్రారంభించాలని పేర్కొన్నారు. అనంతరం కృష్ణయ్య దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్ శ్రీనివాసులు, బీపీఎంలు రామాంజులు, బోనమల అన్వర్, పోస్టల్ సిబ్బంది, కృష్ణయ్య కుటుంబీకులు పాల్గొన్నారు.

ఏపీపీసీబీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు



ఆర్టీసీ బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రాయచోటి టౌన్ : ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ వీధి, శ్రీ వీరభద్రస్వామి ఆలయ సమీపంలోని ప్రధాన వీధుల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఆదివారం ఈ నెల 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 1వ తేది నుంచే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ సీబీ సిబ్బంది, ఏపీఎస్‌ఆర్టీసీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అంతకు ముందుగా పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం



ఎయిడ్స్‌పై కళా ప్రదర్శన ద్వారా వివరిస్తున్న కళాకారులు

రాయచోటి జగదాంబసెంటర్ : ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించి ఎయి డ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని నటరాజ కళాబృందం కోరింది. అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నటరాజ కళా బృందం ఎయిడ్స్ వ్యాధి చైతన్య కార్యక్రమాలను వీధి నాటకం ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. రాయచోటి పట్టణంలోని బంగ్లా సర్కిల్ సమీపంలో ఆదివారం నటరాజ కళా బృందం వీధి నాటకం ద్వారా ఎయిడ్స్ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది.. ఎయిడ్స్ వ్యాధి వస్తే ఎలాంటి వైద్యం పొందాలి.. ప్రభుత్వం ఎయిడ్స్ నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటుంది వీధి నాటకం ద్వారా ప్రజలలో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూఎస్ అంజనమ్మ, చంద్రకళ, సుహాసిని, విజయలక్ష్మీ, ఎల్‌డబ్ల్యూఎస్ డీఆర్‌పీ అల్లావలి, ప్రజలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ఓబులవారిపల్లె: రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని వ్యవసాయాధికారి మల్లిక సూచించారు. ఓబులవారిపల్లె మండలం, చెన్నరాజుపోడు పంచాయతీలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ ఏర్పాటు చేశారు. మహిళా రైతులు, వీఓఏ ఉత్తమ రైతులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి రైతు విత్తన శుద్ధితో బీజామృతంతో ఘన జీవామృతం, కషాయాలు తయారు చేయాలన్నారు. అనంతరం రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసీఏ బుల్లయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హౌసింగ్ బృందం క్షేత్ర పరిశీలన

బి.కొత్తకోట: గృహ నిర్మాణాల్లో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆదివారం గృహ నిర్మాణశాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్.వేణుగోపాల్, జిల్లా అధికారులతో కలిసి మండలంలోని బీరంగి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. రాయచోటిలో అధికారులు, మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించాక బీరంగి గ్రామం ఎంపిక చేసుకుని ఇక్కడికి వచ్చారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న యూనిట్ విలువను పెంచి ఇస్తున్నప్పటికి ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయించలేకపోతున్న కారణాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధికారి వి.సాంబశివయ్య, ఈఈ రమేష్‌రెడ్డి, డీఈ వెంకటరెడ్డి, ఏఈలు లావణ్య, జియా, సిబ్బంది పాల్గొన్నారు.

కాయిల్స్ పొగ ప్రమాదకరం

- విచ్చలవిడిగా మస్కిటో కాయిల్స్ వాడకం
- పొగతో అనారోగ్య సమస్యలు



రాయచోటి జగదాంబసెంటర్ : అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటారు. కానీ మనం దాని కోసం స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటున్నామా? అది ఒక పెద్ద అంశం. లైఫ్ స్టైల్ అలవాట్లతో పాటు పెరుగుతున్న కాలుష్యం వల్ల మన ఇంట్లోకి చెడు గాలి వస్తుంది. కొద్దిసేపు స్వచ్ఛమైన గాలి కోసం తలుపులు, కిటికీలు తెరిస్తే .. గాలితో పాటు, దోమలు, అనేక ఇతర కీటకాలు ఇంట్లోకి ప్రవేశిస్తాయి. దోమలు చాలా ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దోమలను చంపే మస్కిటో కాయిల్స్ శరీరానికి చాలా హానికరం అన్నది నిజం. కాయిల్స్ హానికరమైన రసాయనాలను విడుదల చేస్తుంది. దీంతో ఆస్తమా ఉన్న రోగులు, చిన్నపిల్లలు, వృద్ధులు శరీరంలో ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వ్యక్తులు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నాసిరకం బ్రాండ్‌లతో ప్రమాదం

ఎంత గొప్ప బ్రాండెడ్ వస్తువులు వాడినా పొగ వల్ల మాత్రం అనారోగ్యాలకు గురి కావాల్సిందే. అలాంటిది నాసిరకం బ్రాండ్‌లైతే ఇంక ఆ నష్టం మాటల్లో చెప్పలేనిది. మస్కిటో కాయిల్స్, అగరబత్తీలు వివిధ రకాల బ్రాండ్ల పేరులతో హైదరాబాద్, బెంగళూరు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వస్తుంటాయి. అలాగే వివిధ రకాల పరిమళాలతో అనేక రకాల బ్రాండ్ల పేరుతో స్థానికంగా కూడా తయారు చేసేస్తున్నారు. వీటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇవి మరింత ప్రమాదకరంగా తయారై ప్రజలు అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుంది. మార్కెట్లో గతంలో రీఫిల్స్ 30, 35, 60 రాత్రులు అని విక్రయించేవారు. నేడు హై, లో ఆప్షన్లతో 45 ఎంఎల్ రీఫిల్స్ రూ.85 ధరలతో వస్తున్నాయి. హై లో పెట్టుకంటే 10 నుంచి 15 రోజులు మాత్రమే వస్తున్నాయి. వీటిని గదికి ఒకటి చొప్పున పెట్టుకుంటుంటారు. సాధారణ, మధ్య తరగతి ప్రజలు చక్రాలు, అగరబత్తీలు వాడుతుంటారు. అవి బాక్స్ వచ్చి రూ.30 ఇందులో పది చక్రాలు ఉంటాయి. అగరబత్తి అయితే రూ.10 ఇందులో పది ఉంటాయి. ఇవి అయితే ఇంటిల్లిపాది ఒక చక్రం లేదా అగరబత్తి వెలిగించుకుంటారు.

ఊపిరితిత్తులపై అధిక ప్రభావం

దోమల నివారణ కొరకు ఉపయోగించే చక్రాలు, అగరబత్తీల పొగ పీల్చడం వల్ల ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. తలుపులన్నీ మూసి వెలిగించడం వల్ల కనీసం పొగ బయటకు వెళ్లే మార్గం లేక మొత్తం ఆ గదిలో ఉన్న జనమే పీల్చాల్సి వస్తుంది. దాంతో ఊపిరితిత్తుల్లో పొగ చేరి దగ్గు, ఆయాసం వస్తుంటాయి. దోమల నివారణ కోసం ప్రమాదకరమైన ఉత్పత్తులు వాడే కన్నా ప్రతి కిటికీకి, గుమ్మాలకు దోమతెర మెస్‌లు ఏర్పాటు చేసుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

దోమల నివారణకు చర్యలు

దోమల నివారణకు అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా వాటిని నివారించలేకపోతున్నారు. దోమల నివారణకు టిమోపాస్ మందును వాడుతుంటారు. ఇది 10 ఎంఎల్ మందులో పది లీటర్ల నీటిని కలిపి డ్రైనేజీలో స్ప్రే చేస్తుంటారు. అలాగే ఫాగింగ్ మెషిన్ల ద్వారా దోమల నివారణకు చర్యలు చేపడుతుంటారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉన్నప్పుడు వాటిల్లో ఆయిల్ బాల్స్ వేసి నివారణ చేస్తుంటారు. ఇలా ఎన్ని చేస్తున్నా దోమలను మాత్రం నివారించలేకపోతున్నారు. దీంతో ప్రజలు మస్కిటో కాయిల్స్ వాడి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు.

పొగతో సీఓపీడీ సమస్య



దోమలకు సంబంధించిన చక్రాలు, అగరబత్తులే కాదు ఏ రకమైన పొగ పీల్చినా సీఓపీడీ వస్తుంది. అదే ఆస్తమా ఉన్న వారు గానీ ఊపిరితిత్తుల సమస్య ఉన్న వారికి గానీ ఇలాంటి పొగ పీల్చడం వల్ల సమస్య మరింత జఠిలం అవుతుంటుంది. పిల్లలు, వృద్ధులు కూడా ఈ పొగ అతిగా పీల్చకూడదు. ఏదైనా ఒకటి రెండు పర్యాయాలు అంటే సమస్య ఉండదు.

– డాక్టర్ డేవిడ్ సుకుమార్,
ప్రభుత్వాసుపత్రిసూపరింటెండెంట్, రాయచోటి

బియ్యం సరఫరాలో పారదర్శకత పాటించాలి

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



రేషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్: డీలర్లు బియ్యం సరఫరాలో పారదర్శకత పాటించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఆకేపాడు పంచాయతీలోని పెద్దూరు గ్రామంలో రేషన్ షాపును ఆదివారం తహసీల్దార్ పీర్‌మున్నీతో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరికీ రేషన్ అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు శేషంరాజు, కుమార్‌స్వామి, డీలర్ ఏ రేణుక, వీఆర్‌ఓ విశ్వలత, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నూతన రేషన్ షాపులను ప్రారంభించిన జేసీ



మహిళలకు రేషన్ అందిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణం, వీపీఆర్ కండ్రికలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన రేషన్ షాపులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నెలలో పదహైదు రోజులు ఉదయం, సాయంత్రం రెండుపూటలా రేషన్ అందిస్తామని, అలాగే దివ్యాగులకు, వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ అందిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను పేద ప్రజలకు అందించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మహల్ పాఠశాలకు తాగునీటి సౌకర్యం

కలికిరి: మండలంలోని మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో ఆ పాఠశాల 1985-86 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. గత నెల 11న పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి అవసరమైన సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేయనున్నట్లు ప్రకటించి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ద్వారా తెలుసుకున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఇటీవల తాగునీటి బోరు వేయించారు. ఆదివారం బోరుకు మోటారు, పైపులు ఏర్పాటు చేసి బోరు ప్రారంభించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్థానికులు పూర్వపు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు ఇ.వాసు, చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్, బోరు సుబ్బయ్య, గౌసు, ఖాదర్ వల్లి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణాల ముందు కార్డుదారుల పడిగాపులు

ఈపోస్ యంత్రాలు పని చేయక
డీలర్లకు తప్పని తిప్పలు



చౌకదుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

తంబళ్లపల్లె: ప్రభుత్వం నిత్యావసర సరుకుల పంపిణీలో ఎండీయూల వ్యవస్థను రద్దు చేసి చౌకదుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని ఆదేశించింది. ఆదివారం ఉదయమే చౌకదుకాణ డీలర్లు దుకాణాలు తెరిచి బియ్యం పంపిణీ చేసేందుకు సమాయత్తమయ్యారు. తంబళ్లపల్లె చౌకదుకాణాలలో సాంకేతిక లోపాలతో సర్వర్ సహకరించక ఈపోస్ పంపిణీ యంత్రాలు మొరాయించాయి. దీంతో పంపిణీ ఆలస్యమైంది. పలు చోట్ల డీలర్లు ఏమి చేయలో దిక్కుతోచక జుట్టు పీకోవాల్సి వచ్చింది. అప్పటికే కార్డుదారులు క్యూలో నిలబడలేక దుకాణాల ముందే కూర్చుని పడిగాపులు కాయాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావడంతో మొదటి రోజు బియ్యం కోసం ఎక్కువ మంది రాలేకపోయారు. బియ్యం తీసుకున్న వారు మండుటెండలోనే మోసుకోవాల్సి వచ్చింది. పలువురు ప్రభుత్వంను నిందిస్తూ చేసేది లేక నిట్టూర్చారు.

బతుకులతో సెల్ గాటం

పుల్లంపేట: నిద్రపోయేటప్పుడు ముట్టుకునే చివరి వస్తువు.. నిద్ర లేవగానే ముట్టుకునే తొలి వస్తువు.. సెల్‌ఫోన్.వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌కు అనుసంధానమైపోయారు. కొందరైతే రోజులో సగభాగం సెల్‌ఫోన్ చూడ్డానికే సమయాన్ని కేటాయిస్తున్నారు. కొందరు యువకులు సెల్‌ఫోన్‌లో పబ్జీ వంటి ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలై ఎక్కువ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ముఖ్యంగా వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు ప్రతి ఒక్కరి ఫోన్‌తో టైమ్ పాస్ చేస్తున్నారు. దీంతో బంగారు బాట వేసుకునే వారి జీవితాలు వ్యసనాలకు బానిసలవుతున్నారు. యువత ఇప్పటికైనా మేలుకొని ఇలాంటి అలవాట్లకు దూరంగాఉండాలని పలువురు కోరుకుంటున్నారు.

అధికంగా వాడితే ఇబ్బందులే

స్క్రీన్ చూసే సమయం పెరగడంతో శారీరక శ్రమ తగ్గి బరువు పెరుగుతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రిళ్లు ఎక్కువ సమయం మేల్కోవడంతో నిద్రలేమి, వినికిడి సమస్యలు ఏర్పడుతాయని చెబుతున్నారు. కళ్లు పొడిబారడం, తలనొప్పి, పార్శ్వపు నొప్పి, దృష్టిలోపం రావచ్చని పేర్కొంటున్నారు. బైక్ నడుపుతూ ఫోన్ మాట్లాడటంతో మెడనొప్పి వస్తుందని హెచ్చరిస్తున్నారు. అయితే ఫోన్‌ను అధికంగా వినియోగించడం ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



సెల్ ఫోన్‌లో గేమ్ ఆడుతున్న యువకులు

సన్మానం



బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పుల్లంపేట: పుల్లంపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ పదవీ విరమణ సందర్భంగా నవభారత కళానిలయం సంస్థ తరపున సన్మానించారు. శ్రీనివాస్ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కడప జిల్లాలో ఉత్తమ బ్యాంక్ మేనేజర్‌గా అవార్డు అందుకున్నారు. బ్యాంక్ అభివృద్ధికి తనవంతు కృషి చేశారని నవభారత కళానిలయం అధ్యక్షుడు డాక్టర్ ఏవీ సుబ్బరాజు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసుపులేటి గోపినాథ్, యువి రాయుడు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యం అందిస్తున్న డాక్టర్ వెంకటరమణ

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు పట్టణంలోని సిల్వర్ బెల్స్ హైస్కూల్‌లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన ప్రముఖ వెంకటరమణ వెటర్నటీ ఆసుపత్రి చైర్మన్, సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వెంకటరమణ, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ నిరుపమాలు పలువురికి వైద్యం అందించారు. అలాగే ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవనశైలిని మార్చుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ మెంబర్లు, వైద్యులు, రోగులు పాల్గొన్నారు.

నివాళి



నాగూర్ వలిబీ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి తదితరులు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని కోనంపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగూర్ బాషా, సతీమణి నాగూర్ వలిబీ (60) శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య ఆదివారం కోనంపేటలో బాషా నివాసంలో వలిబీ మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, సర్పంచ్ జనార్దన్ రెడ్డి, శంకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వేణుగోపాల్, మాజీ డీలర్ శివ మల్లినాయుడు, కార్తీక్, ఆంజనేయులు ఉన్నారు.

చల్లంగా చూడమ్మ..గంగమ్మ



ఆలయంలో రాయిని మొక్కుతున్న భక్తులు

సంబేపల్లె : చల్లంగా చూడమ్మ.. గంగమ్మ అంటూ భక్తులు ఆలయ చుట్టూ ప్రదక్షిణ చేశారు. మండల పరిధిలోని శ్రీదేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం గంగమ్మకు బోనాలు సమర్పించారు. వర్షాలూ బాగా కురిసి పంటలు బాగా పండాలని, నీటి సమస్య లేకుండా చూడాలని మొక్కుకున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించి పూజలు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఎంతో మహిమ కలిగిన దేవరరాయిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని పీఎన్‌కాలని గ్రామం నగరిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం వేదపండితులు సాయిస్వామి ఆధ్వర్యంలో హోమాలు, స్వామివారి ఉత్సవ విగ్రహాలు గ్రామోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మహోత్సవానికి మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం స్వామివారి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఇరుగులమ్మకు పూజలు



పూజలందుకుంటున్న ఇరుగులమ్మ

సిద్దవటం: మండలంలోని సిద్దవటం గ్రామ శివారులో మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద పెన్నానది ఒడ్డున ఉన్న ఇరుగులమ్మ అమ్మవారికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించామని ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఇరుగులమ్మ అమ్మవారికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు.భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఎల్లమ్మ తల్లికి పొంగుబాలు



పెనగలూరు: అమ్మవారికి పొంగుబాలు సమర్పిస్తున్న మహిళలు



నందలూరు: గంగమ్మ తల్లికి పొంగుబాలు తీసుకెళ్తున్న మహిళలు

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు గ్రామంలో వెలసిన ఎల్లమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పొంగుబాలు సమర్పించారు. శనివారం రాత్రి ఎల్లమ్మ ఆశాదు కథ ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున ఎల్లమ్మ ప్రతిమను తొమ్మిది రంగుల పొడులతో పెద్ద ప్రతిమను ఏర్పాటు చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామ పురోహితుడు చెంచు సుబ్బ నరసయ్య, ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్యలు తెలిపారు. వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే ఆదివారం ఈ ఎల్లమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

నాగిరెడ్డిగారిపల్లెలో..

నందలూరు : నాగిరెడ్డిగారిపల్లె గ్రామం గంగమిట్టలో వెలసిన గంగమ్మ తల్లికి ఆదివారం ఘనంగా పొంగుబాలు సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగుబాలను ఊరేగింపుగా అమ్మవారి వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మారెమ్మ జాతరకు ముందుగా గంగమ్మకు పొంగు పాలు పెట్టడం అక్కడి ప్రజల ఆనవాయితీ. ఈ నెల 6, 7, 8వ తేదీలలో మారెమ్మ జాతరను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తులకు కల్పవల్లి దండువారమ్మ తల్లి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సుండుపల్లె : భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన దండువారమ్మ తల్లికి తిరునాల సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని గంగిరెడ్డిగారిపల్లె గ్రామంలో వెలసిన దండువారమ్మకు గ్రామ ప్రజలు అందరూ భక్తిశ్రద్ధలతో పూజలు చేసి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేవారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేత్రపర్వంగా శ్రీరామ నవమి వేడుకలు



సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న గ్రామస్తులు

పెనగలూరు: మండలంలోని పొందలూరు దళితవాడలో శ్రీరామ నవమి వేడుకలు శనివారం రాత్రి నేత్రపర్వంగా సాగాయి. ఈ గ్రామంలో పెంచల నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు తరువాత శ్రీరామ నవమి వేడుకలు జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామస్తులు ఈ వేడుకలను బంధువులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం వసంతోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



గంగమ్మకు పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలో ఘనంగా గంగమ్మ జాతర ఆదివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేశారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం



వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయచోటి టౌన్ : ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదామని రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ఒక్క పథకం కూడా అమలు చేయకుండా విద్యార్థులను, యువతను, మహిళలను, రైతులను మోసం చేసిందన్నారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో శాంతిభద్రతలను గాలికొదిలేసి కేవలం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కక్ష సాధింపులే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను నిరసిస్తూ జూన్ 4వ తేది వెన్ను పోటు దినోత్సవం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. షబ్బీర్, రియాజ్, కొలిమి చాన్ బాష, అల్తాఫ్, సుగవాసి శ్యామ్, అన్నా సలీం, గౌస్‌ఖాన్, మేధావుల ఫోరం నియోజక అధ్యక్షులు జానం రవీంద్ర యాదవ్, రియాజుర్ రహిమాన్, కో ఆప్షన్ సభ్యుడు అయ్యవారరెడ్డి, టౌన్ అధ్యక్షులు యూసూప్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.